
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3, కనిష్ఠం 25.4
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025





రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు

నాబార్డు చేయూత

- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉపాధి కల్పనకు కసరత్తు
- కొత్తగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు
- మత్స్య, డెయిరీ సంఘాలకు ప్రోత్సాహం అందించేందుకు నిర్ణయం
- రూ.15లక్షల వరకు ఆర్థిక చేయూతనివ్వనున్న నాబార్డు

నిజామాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) ప్రోత్సాహం అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు చేయూతను ఇస్తుంది. మత్స్య, డెయిరీతో పాటు ఇతర రంగాలకు సంబంధించి రూ.15 లక్షల వరకు ఈ ఉత్పత్తిదారులకు అందించేం దుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ యేడాది ఈ రెండు రంగాలతో పాటు మేకలు, పందుల పెంపకాన్ని కూడా సంఘాలు ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక సహకారం అందించేందుకు సిద్ధమవుతోంది. రైతు ఉత్పత్తి దారులు తమ వాటా ధనాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే అదే రీతిలో రూ.15 లక్షల వరకు ఈక్విటీ గ్రాంట్‌ను నాబార్డు అందించనుంది. మూడేళ్ల పాటు ఈ ఉత్పత్తిదారులకు సహాయం అందించేందుకు మేనేజర్, అకౌంటెంట్‌ల వేతనాలకు కూడా సహాయం అందించనుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను పెంచడంతో పాటు ఆర్థికంగా వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులు అభివృద్ధి చెందేందుకు ఈ ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నాబార్డు ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తోంది. మత్స్య, డెయిరీ సంఘాలను రైతులు ఏర్పాటు చేసుకుంటే ఒక్కొక్క సంఘానికి వారి సభ్యత్వాన్ని బట్టి గరిష్ఠంగా రూ.15లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని అందించనుంది. జిల్లాలో ఈ రెండు వ్యవసాయ అనుబంధ రంగాలను ఈయేడాది నాబార్డు ప్రోత్సహించేందుకు నిర్ణయించింది. ఏ గ్రామం పరిధిలోనైనా కనీసం వంద మంది సభ్యులతో కలిసి సంఘాన్ని ఏర్పాటు చేయాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘం పేరుమీద మత్స్య శాఖ బోర్డు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. డెయిరీ ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటే డెయిరీ బోర్డులో రిజిస్టర్ చేసుకోవాలి. సభ్యులుగా చేరిన వారు కనీసం 2వేల రూపాయలను కనీసంగా షేర్ పెట్టాలి. సభ్యులు 2వేల నుంచి ఆపైన 4వేల వరకు సభ్యత్వం కింద చెల్లించాలి. వంద మందితో ఏర్పడిన రైతు ఉత్పత్తి దారుల సంఘం కానీ అంతకుమించి సభ్యులతో ఏర్పడిన 10 మందితో డైరెక్టర్లను ఏర్పాటు చేయాలి. పూర్తి స్థాయిలో రిజిస్టర్ అయి డబ్బులను బ్యాంకులో డిపాజిట్ చేసిన తర్వాత నాబార్డు పరిశీలించి ఈ ఈక్విటీ షేర్ కింద వారు పెట్టిన డబ్బుల ఆధారంగా గరిష్ఠంగా 15 లక్షల వరకు అందిస్తారు. సభ్యులు తక్కువగా ఉంటే ఈక్విటీ షేర్‌ను వారు నిలువ చేసిన డబ్బుకు అనుగుణంగా ఇస్తారు. ఈ రెండు రంగాలను ప్రోత్సహించడం

మిగతా 8వ పేజీలో...

నేటి నుంచి ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకొని నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఈసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌ను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా కౌన్సెలింగ్ సమన్వయకర్త పి.భారతి తెలిపారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనే అభ్యర్థులు శనివారం నుంచి ఈ నెల 18 వరకు టీజీఈసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని అనంతరం వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సీట్ల కేటాయింపు 25వ తేదీన ఉంటుందని సీట్లు పొందిన వారు 25 నుంచి 29 లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డ్, ఎస్సెస్సీ డిప్లొమా మెమోలు, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్, టీసీ, ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ బాలుర కళాశాలలోని కౌన్సెలింగ్ కేంద్రంలో నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి వెబ్‌ఆప్షన్‌కు అవకాశం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్‌లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ డీఈఈసెట్ అర్హత సాధించి ఈ నెల 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు కళాశాలల ఎంపిక కోసం ఈనెల 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వవల్సి ఉంటుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్స్ ప్రకారం మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన ఈనెల 20న సీట్ల కేటాయింపు ఉంటుందని, సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 24 వరకు ఫైనల్ అడ్మిషన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకొని టీసీతో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. జూలై 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా టి.వినయ్‌కృష్ణా రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.45 నిమిషాలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. నేరుగా తన ఛాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇతర అధికారులతో భేటీ అయి జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితుల గురించి వారితో చర్చించారు. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు ఆయన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.వినయ్‌కృష్ణారెడ్డిని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, భాస్కర్, నిజామాబాద్ నార్త్ మండల తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



భవానీపేట్ స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న డీఈవో

బోధన్‌రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని భవానీపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. భవానీపేట్ గ్రామంలో 11సంవత్సరాల తర్వాత పాఠశాలను పునఃప్రారంభించడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలలో గదులు, మరుగుదొడ్లు నిర్మించిన రుద్ర ఫౌండేషన్ వారికి డీఈవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, ఎంపీడీవో బాలగంగాధర్, ఉపాధ్యాయులు కార్తీక్, సీఆర్‌పీ విజయ్, రుద్ర ఫౌండేషన్ ప్రతినిధి కిషోర్ చౌదరి, గ్రామస్థులు భూమేష్, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గ్రామాల్లో తిరగనివ్వం: రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ పదవి పోయి పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నాడని సీఎం రేవంత్‌రెడ్డిపై మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊర్లల్లో తిరగనివ్వబోమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో అడ్డగోలుగా దోచుకొని విచారణలో ఎక్కడ తమ బండారం బయటపడుతుందోనని కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పిచ్చి కూతలు కూస్తున్నాడని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టుల విషయంపై మాత్రమే మంత్రులతో సబ్ కమిటీ వేశారని, కాళేశ్వరం విషయంలో కాదని బీఆర్ఎస్ నేతలు తెలుసుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం లేదని, రూ.90వేల కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు ఎలా కూలిందో జవాబు చెప్పాలన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని, ఒకవైపు కవిత లిక్కర్ స్కామ్ మరోవైపు కేటీఆర్ ఫార్ములా 1 రేస్, కేసీఆర్, హరీష్‌రావులు కాళేశ్వరం పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుందని అది చూసి ఓర్వలేక కేటీఆర్ ఫస్ట్రేషన్‌లో సీఎంపై వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కేసీఆర్, కేటీఆర్‌లను ఈడీ, సీబీఐ నుంచి కాపాడుతుంది బీజేపే అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతుందని ఇటీవల కవిత కూడా అదే విషయం చెప్పిందని గుర్తుచేశారు. మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు అన్యాయం జరిగిందని అధిష్ఠానానికి ఈ విషయం చెప్పామన్నారు. ఇంకా మూడు ఖాళీలు ఉన్నందున జిల్లాకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరి ఆత్మహత్య



సాయిలు మృతదేహం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడడం కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి తర్వాత ఆసుపత్రి ఎదుట ఉన్న గ్రిల్‌కు కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మహమ్మదాబాద్‌కు చెందిన పొనుగంటి సాయిలు (37) ఉరివేసుకున్నాడు. ఈనెల 6న సాయిలు తన భార్య సంగీతను డెలివరీ కోసం నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకురాగా అదే రోజు ఆమె మగ బిడ్డకు జన్మనివ్వగా శిశువు మరణించింది. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య సంగీతకు క్రమంగా పల్స్‌రేట్ పడిపోయి పరిస్థితి విషమంగా మారింది. దీంతో చేతిలో డబ్బులు లేకపోవడం ఇతరుల వద్ద తీసుకున్న అప్పు ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపంతో సాయిలు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆసుపత్రి అధికారులు నగరంలోని 1వ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

టీజీఎన్‌పీడీసీఎల్ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..

- అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ చాట్‌బాట్
- ఫిర్యాదులు మొదలుకొని దరఖాస్తుల వరకు..
- ఆధునిక సాంకేతికతను జోడించిన టీజీఎన్‌పీడీసీఎల్
- సమస్యలకు పరిష్కార వేదికగా పోర్టల్

7

సమస్యల వలయంలో సరస్వతీ నిలయాలు!

- అరకొర వసతుల మధ్య విద్యాబోధన
- శిథిలావస్థలో తరగతి గదులు
- వర్షానికి ఉరుస్తున్న తరగతి గదులు

7



ఫీ జులుం

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడి
- పుస్తకాలు, డ్రెస్సులకు వేలల్లో వసూళ్లు
- అడ్డగోలుగా స్కూల్ ఫీజుల పెంపు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభమయ్యిందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురయ్యేలా ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు వ్యవహరిస్తున్నాయి. నర్సరీ విద్యార్థులకే లక్షల్లో ఫీజులు వసూళ్లు చేస్తూ సామాన్యుడికి ప్రైవేటు విద్య చదవాలంటే అందని ద్రాక్షలాగే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీలు వేసి కలెక్టర్ ఆమోదంతో ఫీజులు పెంచాల్సి ఉండగా ఇష్టారాజ్యంగా తమకు నచ్చినట్లుగా ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులను పెంచేశాయి. గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరం 10 నుంచి 20 శాతానికి పైగా ఫీజులను పెంచాయి. అదనంగా పుస్తకాలు, డ్రెస్సులకు వేలాది రూపాయలను వసూలు చేస్తున్నాయి. పాఠశాల ప్రాంగణాలలో పుస్తకాలు, డ్రెస్సులు అమ్మవద్దనే నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు యథేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండానే విక్రయాలు చేస్తున్నాయి. నగరంలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీ వద్ద గత ఏడాది ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు పాఠశాల నర్సరీ విద్యార్థులకు పుస్తకాలతో పాటు డ్రెస్సులకు ఏకంగా రూ.15వేలకు పైనే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం చేరిన విద్యార్థి అయిన మళ్లీ ఈ సంవత్సరం కూడా కొత్త డ్రెస్సులు తీసుకోవాలని సదరు పాఠశాల నిబంధనలు పెట్టినట్లు తెలుస్తోంది. అర్హతలేని టీచర్లను పెట్టుకొని విద్యాసంస్థల్లోనే పుస్తకాలు, యూనిఫామ్‌లు అమ్ముతూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. తోకపేర్లు, ఐఐటీ లాంటి కోచింగ్‌ల పేరుతో ఉన్న ఫీజుతో పాటు అదనంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను తల్లిదండ్రులను



ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడిపై డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొన్ని పేరు పొందిన పాఠశాలలు తమ పాఠశాలల్లో సీట్ల కొరత ఉందని చెప్పి సీటు కావాలంటే డొనేషన్లు తప్పనిసరిగా చెల్లించాలని డొనేషన్లతో అడ్మిషన్లు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు అదనంగా సెక్షన్‌లను పెంచుకుంటూ నిబంధనలను తుంగలో తొక్కి వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

అడ్డగోలుగా అనుమతులు..

జిల్లాలో ఇప్పటికే 400లకు పైగా ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా ఈ విద్యాసంవత్సరం సుమారు 50కి పైగా ప్రైవేటు పాఠశాలలు జిల్లాలో ఏర్పాటు చేశారు. బ్రాంచీల పేరుతో ఇతర ప్రాంతాల్లోని స్కూళ్లను ఇక్కడ ఏర్పాటు చేసినప్పటికీ వాటికి ఎలాంటి అనుమతులు లేకున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తుంది. ప్రైవేటు పాఠశాల ఏర్పా టుకు గ్రౌండ్, ఫైర్, శానిటరీ సర్టిఫికెట్లు తప్పనిసరి అయినప్పటికీ అవేమి పట్టనట్లు విద్యాశాఖ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీలు చేసి నూతన పాఠశాలల ఏర్పాటుకు అనుమతులను ఇచ్చేస్తున్నారు. నగరంలో ఇటీవల ఏర్పాటైన రెండు ఇంటర్నేషనల్ పాఠశాలలు, మరికొన్ని ప్రైవేటు పాఠశాలలకు అనుమతుల విషయంలో అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉంటేనే అను మతులు ఇవ్వాల్సి ఉండగా ఇంకా నిర్మాణం పూర్తికాని పాఠశాలలు సైతం విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని హడావిడిగా అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా విద్యాశాఖలో కిందిస్థాయి సిబ్బంది అనుమతుల జారీ విషయంలో అన్నీ తామై వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండానే కొన్ని పాఠశాలలు షిఫ్టింగ్ పర్మిషన్లు పొందగా, కొన్ని పాఠశాలలకు ఇంకా షిఫ్టింగ్ అనుమతులు రాకుండానే ఆ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి ఇతర ప్రదేశాలకు మార్చినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

సీటు కోసం డొనేషన్ల వసూళ్లు..

నగరంలోని కొన్ని ప్రము ఖ ప్రైవేటు పాఠశాలలు విద్యను సేవా భాగంగా కాకుండా వ్యాపార ధోరణితో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని కొన్ని ప్రముఖ పాఠశాలల్లో సీటు పొందాలంటే ఖచ్చితంగా డొనేషన్లను ఇవ్వాల్సిందే.

మిగతా 8వ పేజీలో...

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం..

: అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపు విషయమై ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన ప్రైవేటు పాఠశాలలపై విచారణ చేయాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించాం. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే వాటిపై చర్యలు తీసుకుంటాం. ఫీజుల విషయంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. పాఠశాలల్లో ఫీజులకు సంబంధించిన జాబితాను ప్రదర్శించాలి. అలా ప్రదర్శించని పాఠశాలలపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.



విరాళం ఇచ్చిన దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 15వేలు విరాళం

ఆలూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీవేయి నామాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అమెరికాలో నివాసం ఉంటున్న గుర్రం త్రివేణి, మల్లేష్‌గౌడ్ రూ. లక్ష 15వేలు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు. విరాళం అందజేసిన మల్లేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ స్వామి, అర్జున్ గౌడ్, మహేందర్, సతీష్, సింగిడి చిన్నగంగారాం, నడ్కుడ గగారెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాల సీజ్



ఆర్మూర్‌లో పాఠశాలను సీజ్ చేస్తున్న అధికారులు

ఆర్మూర్ రూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని వెంకటేశ్వర కాలనీలో అనుమతి లేని హాపికిట్స్ పాఠశాలను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రకటనలు చూసి మోసపోవద్దని నాణ్యమైన విద్యను అందించే పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

మోర్తాడ్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్కల్, ధర్మోర, శెట్‌పల్లి గ్రామాలలో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థు లకు ఏకరూప దుస్తువులున కమ్యునిటి కోఆర్డినేటర్ తడకల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. మూడు గ్రామాలలో 226 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏ లు తలారి దీప, స్వరూప, హంస, మహిళ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల ఇంటింటా ప్రచారం



పెర్కిట్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఆర్మూర్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని మగ్గిడి, ఖానాపూర్, పెర్కిట్, అమ్దాపూర్ గ్రామాలలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, హాస్టల్ వసతి కల్పించి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యను అంది స్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విజయానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బట్టు చంద్ర శేఖర్, రమకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణమోహన్, లక్ష్మణ్, పోతు నరేష్, నిఖిత, విజయలక్ష్మీ, చంద్రమోహన్, గంగాధర్, సుభాష్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడపొద్దు



బస్సును సీజ్ చేసిన ఎంవీఐ

బోధన్‌రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడపవద్దని బోధన్ ఎంవీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని స్టాండర్డ్ పాఠశాలకు చెందిన బస్సుతో పాటు విజయమేరి పాఠశాలకు చెందిన రెండు బస్సులను సీజ్ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల బస్సులు ఆర్టీఏ పూర్తి నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులలో విద్యార్థులు తీసుకెళ్లినట్లయితే కేసులు నమోదు చేయబడతాయన్నారు. పాఠశాలల ప్రతి బస్సును ఫిట్‌నెస్ చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలు జరపాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి

మెండోర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిం చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా కులగణన చేపట్టిన విషయంలో బీసీలు 56శాతం సర్వే రిపోర్టులో ప్రభుత్వమే ప్రకటించిందని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. గవర్నర్ ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయం అందరికి తెలుసని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపగానే మా పని అయిపోయిందని చూస్తుంటే సరిపోదన్నారు.

దాడి చేసిన ఆరుగురి అరెస్టు

మోర్తాడ్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 11న రాత్రి రొయ్యల సురేష్‌ను మజీద్ ఏరియా వద్ద దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఆరుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి జైలుకు పంపించామని ఎస్సై విక్రం తెలిపారు. రాత్రి సురేష్ తన కారులో వెళ్తుండగా మజీద్ ఏరియాలో మార్గమధ్యంలో రోడ్డుపై బైక్‌లు నిలిపివున్న మహ్మద్ షాబాజ్, అబ్దుల్ మజహర్‌లను బైక్ తీయు మని అడుగగా వారు ఇద్దరు సురేష్‌ను అసభ్యపదజాలంతో దూషించి ఆయనపై బైక్‌ను ఎత్తిపడవేసి రాడ్‌తో తలపై కొట్టారన్నారు. అదే సమయంలో అక్కడ ఉన్న మరికొందరు వ్యక్తులు దాడిచేస్తున్న వారికి మద్దతుగా వచ్చి వారుకూడా సురేష్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని సురేష్ భార్య సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మహ్మద్‌షాబాజ్, అబ్దుల్ మజహర్‌లతో పాటు మహ్మద్ అస్లాం, అబ్దుల్ మాలిక్, అబ్దుల్ హర్యాస్, మహ్మద్ ఫాయాజ్‌లను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు ఎస్సై తెలిపారు.



చిన్నారులతో అక్షరభ్యాసం చేయిస్తున్న బాల్కొండ ఎంఈవో



ఆలూరులో చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తున్న ఎంఈవో



అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక విద్యాభ్యాసం దృశ్యం

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

బాల్కొండ , జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్, ప్రేమ్ నగర్ కాలనీలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బట్టు రాజేశ్వర్ విద్యార్థులచే సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామస్వామి, శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సురేష్ పా ల్గొన్నారు.

ఆలూర్: ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిన్నపిల్లలకు అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో నరేందర్ పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తమ పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తువులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని మండల పరిష త్ బాలికల ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎని మిదో రోజు విద్యార్థులకు సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం చేయించారు. ఈ విద్యసంవత్సరంలో నూతనంగా పాఠశాలలోకి వెళ్లిన ఒకటవ తరగతి విద్యార్థులచే ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, బాలరాజు విద్యార్థులచే అక్షర భ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణచారి, నర్సింహామూర్తి, సాగర్, పీఆర్‌పీ సాయిరాం పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల్లో చదువుతల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్తగా చేరిన విద్యార్థులచేత అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, అన్ని రకాల వసతులు, పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయులు ఉదయ్ చంద్ర, కృష్ణమోహన్, నాయకులు కొట్టం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● పాండుఫారం ఉర్దూ మీడియం పాఠశాలలో బడిబాట

బోధన్‌రూరల్: బోదన్ పట్టణంలోని పాండుఫారం ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హైమది మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం సైతం అందించబడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్య బోధన ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజియా బేగం, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. బడిబాటలో కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నూతనంగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. నాగేపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సరస్వతి దేవి అవతారాన్ని ధరించిన చిన్నారి అందరిని ఆకట్టుకుంది.

మోపాల్: మండల కేంద్రంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దేవిక పిల్లల చేత అక్షరాభ్యాసం చేయించారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, జ్యోత్స్న, ప్రేమ్ లాల్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సాలంపాడ్‌లో అమ్మమాట అంగన్‌వాడీ బాట

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని సాలంపాడ్ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను ఇంటింటికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ ప్రాముఖ్యతను కమిటీ సమావేశంలో వివరించారు. అనంతరం అమ్మ మాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, అంగన్‌వాడీ టీచర్లు జమున, పద్మ, సావిత్రి పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఐసీడీ ఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు వారి తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడి సెంటర్‌లో సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ , సవితరాణి, అరుందతి, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.



నాగేపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



నాగేపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి పూజ



మోపాల్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

జక్రాన్‌పల్లి , జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపల్లిలో శుక్రవారం రెవె న్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తమ భూసమస్యలు పరిష్కరించాలని రైతులు దరఖా స్తులు చేసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన భూసమస్యల దరఖాస్తులను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, మాజీసర్పంచ్ చిన్నసాయిరెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ఆర్‌ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎడపల్లి : ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న తమ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగ పరుచుకోవాలని మండల తహసీల్దార్ దత్తాత్రి అన్నారు. అందులో భాగంగా శుక్రవారం ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో రెవె న్యూ సదస్సును నిర్వహించా మని, భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి పేర్కొన్నారు. ఠాణాకలాన్ గ్రామంలో సుమారు 81కి పైగా వివిధ రకాల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అనూష ఉన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో చివరి రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో 269 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఉదయం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం భారీ ఎత్తున పాల్గొన్నారు. దరఖాస్తులు ఇచ్చిన రైతుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు.

కమ్మర్‌పల్లి : గత 20 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తమకు సర్వే నెంబర్ 574లో పట్టాలు ఇచ్చిందని పలువురు అన్నారు. అదే సర్వే నెంబర్‌లో మిగులు భూమి ఉండి 30 మంది ఖబ్జాలో ఉన్నారని వారికి సైతం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హసాకొత్తూర్ గ్రామంలో నిర్వహించిన రైతుల సదస్సు వద్ద లబ్ధిదారులతో కలిసి సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు ధర్నా చేపట్టారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోటగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత గంజాయిలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్‌ఐ సునీల్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద ఎస్‌ఐ సునీల్ మాట్లాడుతూ యువత కల్తీకల్లు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బన్సీలాల్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ వరకు డ్రగ్స్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ మహమ్మారి మత్తులో పడవద్దని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐలతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కొత్త బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థలపై ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సిరికొండ :మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ కోరారు. సిరికొండ మండలం చిన్నవాల్గోట్ గ్రామంలో శుక్రవారం యువకులు,మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామ మధ్యలో మానవ హారంగా ఏర్పడి గంజాయి,హెరాయిన్ లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని,వాటికి దూరంగా ఉంటామని ఎస్సై ఎల్.రామ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మహిపాల్,రాజు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

సిరికొండ జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలను అదిరోహిస్తారని సిరికొండ ఎండీవో కె.ఆర్.మనోహర్‌రెడ్డి విద్యార్థులను కోరారు. సిరికొండ హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఎండీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు మీ భవిష్యత్తును నిర్దేశించే ఆయుదాలని అన్నారు. బాగా చదివిమంచి మార్కులతో ఉత్తీర్ణులయితే మీ తల్లిదండ్రులకు, విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు, మీగ్రామానికి మంచి పేరుప్రఖ్యాతులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు గోదావరి, కాంగ్రేస్,బిజెపి నాయకులు ఆసీప్,బాబురావు, సర్పంచ్ తండాలో, గోప్య నాయక్ తండాలో ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రేస్ నాయకులు సంతోష్ నాయక్,జయరాం నాయక్ తదితరులు పంపిణీ చేశారు.

తెలుగు ఎన్‌ఆర్‌ఐల స్వచ్ఛ బెహరాన్

ఆర్మూర్ రూరల్, జూన్13 (ఆంధ్రజ్యోతి): బెహరాన్‌లో తెలుగు ఎన్‌ఆర్‌ఐలు స్వచ్ఛభారత్ నినాదం ఆదర్శంగా తీసుకుని శుక్రవారం స్వచ్ఛ బెహరాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు చెందిన పలువురు యువకులు స్వచ్ఛ బెహరన్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాలలో చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వంటి చెత్తవల్ల భూమికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెత్తను ఎక్కడపడితే అక్కడ కాకుండా డస్టుబిన్ లో వేయాలని అవగాహన కల్పించారు. శ్రమదానం చేసి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో వేసినట్లు స్వచ్ఛ బెహరాన్ నాయకులు రామ్మోహన్, గడ్డం రాజు, సురేష్, పరమేశ్వర్, జేడి నర్సారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

బాల్కొండ , జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్, ఇత్వార్‌పేట్, కిసాన్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వెంక టేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అదే విధంగా సంక్షేమ పథకాలలో అర్హులై ఉండికూడా లబ్ధిపొందని వారిని గుర్తించి వారి వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సాట్ల ప్రవీణ్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తౌటు అర్వింద్, గంగమల్లు, మోహన్‌రెడ్డి, కిసాన్‌గౌడ్, సంజీవ్‌రెడ్డి, రంజిత్, సంతోష్, సందీప్, గంగాధర్, కపీల్, చాట్ల నరేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌ఆర్ నగర్‌లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కోటగిరి,జూన్13(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని పీఎస్‌ఆర్ నగర్(రాంగంగానగర్) గ్రామంలో మురుగు నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. పీఎస్‌ఆర్ నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ముందు చిన్నపాటి వర్షానికే వరద నీరు చేరుతోంది. ఇళ్ల సమీపంలో మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంత పంట పొలాల్లోకి వెళ్లి ఇంకిపోయేది. సీసీ డ్రైనేజీ తక్కువ ఎత్తులో నిర్మించడంతో మురుగు నీరంత బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. కొందరు రైతులు సైతం తమ పొలాల్లోకి మురుగునీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో నీరంత ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు పక్క నుండే తాత్కాలికంగా మురుగు కాలువను తీయించడంతో తాత్కాలిక పరిష్కారం ఏర్పడింది. మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, ఏఎస్‌ఐ బన్సీలాల్ తదితరులున్నారు.

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఎడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలో నూతనంగా వ్యవసాయ భూమిని పట్టా చేసుకున్న రైతులు రైతు భరోసా పథకంకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో అయన మాట్లాడుతూ 05-06-2025 కన్నా ముందు పట్టా చేసుకున్న రైతులు రైతు భరోసా పథకం దరఖాస్తు ఫారంతోపాటు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ బ్యాంక్ అకౌంటు జిరాక్స్‌లతో ఈ నెల 20వ తేదీ వరకు రైతు వేదికలో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారికి సమర్పించాలని కోరారు.

వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడికి సన్మానం

ఆర్మూర్ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్వి హన్మంత్‌రెడ్డిని శుక్రవారం పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న ఎన్వీ హన్మంత్‌రెడ్డి ఇటీవల జరిగిన వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా గెలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వాలీబాల్ క్రీడ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

కోటగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, దేవునిగుట్ట తండా, బస్వాపూర్, లింగాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకోవాలని సూచించారు. నిర్మించుకున్న ఇళ్లకు దశల వారిగా బిల్లులు వస్తాయన్నారు. ఆయా గ్రామాలలో పలు నర్సరీలను పరిశీలించారు. అనంతరం కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మండలాలల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక స మావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాలలో పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ ఎంపీడీవో చందర్, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

ఆర్మూర్ టౌన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, ఆర్మూర్‌లోని మామిడిపల్లి ప్రాంతంలో ఎంవీఐ వివేకానంద రెడ్డి ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. స్కూల్ బస్సులు, గూడ్స్ వాహనాలను ఆయన తనిఖీ చేసి ఫిట్‌నెస్ పర్మిట్‌లను పరిశీలించారు. దీంతో రెండు వాహనాలను సీజ్ చేసి స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సులు, ఇతర వాహనదారులు సరైన సమయంలో ఫిట్‌నెస్, ఇన్సురెన్స్ ట్యాక్స్ లు నిర్వహించాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

'అర్చకుల జీవితాల్లో వెలుగు నింపారు'

రుద్రూరు, జూన్13 (ఆంధ్రజ్యోతి): దూపదీప నైవేద్య అర్చకులకు సంక్షేమ పథకాలను, నిధులు మంజూరు చేసినందుకు అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పాత వర్నిలో గల శంభుని దేవాలయం వద్ద వర్ని, రుద్రూరు, చందూర్, మోస్రా, కోటగిరి మండలాల అర్చకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చిత్రపటాలకు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ అర్చకులకు సంక్షేమ పథకాలు, నిధులు మంజూరు చేసి అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి బసప్ప, ఉమ్మడి జిల్లా కన్వీనర్ శివస్వామి, ఆరు మండలాల అధ్యక్షులు భాను ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సతీష్, పరమేశ్వర్, శంకరప్ప, టీ.సంతోష్, గిరి, ప్రేమ్‌దాస్, రతన్, మహేందర్, విజయ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆర్మూర్ టౌన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 10, 31వ వార్డులలో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్యక్రమంతో పాటు ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులైన డెంగ్యు, మలేరియా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నీలిమ, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,జూన్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవీపేట, జన్నేపల్లిల లోని 33/11సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కేజీబీవీ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మాక్లూర్, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తువులు ఎంపీడీవో లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పిల్లలకు పాఠశాల ప్రారంభం రోజునే అందజేస్తున్నారని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగంచుకొని శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో సత్యనారాయణ, ఏపీఎం అనిల్‌కుమార్, కేజీబీవీ చైర్మన్ సవిత, ఏఎస్‌వో స్రవంతి, సీసీలు రాజేష్, లత, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



లింబూర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద పెంటకుప్ప

వానాకాలం.. వ్యాధుల కాలం!

● పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే అనారోగ్యమే..
● జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

మద్నూర్,జూన్ 13(ఆంధ్రజ్యోతి: వానాకాలం మొదలైంది. నిన్నమొన్నటి వరకు కురిసిన చిన్నపాటి వర్షాలకే మండలంలోని ఆయా గ్రామాల్లోని కాలనీలు, రహదారులు చిత్తడిగా మారాయి. మురికి కాలువలు, గుంతల్లో నీరు నిలువ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. తాగునీటి ట్యాంకుల్లో నీటిని క్లోరినేషన్ చేయక పోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర ప్రమాదకర వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడితేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెప్తున్నారు. అధికా రులు, ఆరోగ్యసిబ్బంది, సమన్వయంతో స్పందిస్తేనే వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుంది. కానీ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటి నిల్వలతో ప్రమాదం

వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిల్వలు ఉంటోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంది. ఖాళీ ప్రదేశాల్లో ఇంటి ఆవరణలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటికుండీలు, ట్యాంకులు, వేసవిలో వినియోగించిన కూలర్లు, నీటి డ్రమ్ములు తదితరాల్లో నీరు ఉండకుండా శుభ్రపరచుకోవాలి.

ముందస్తు చర్యలు తప్పనిసరి

వర్షాకాలంలో నీరు నిలిచిన ప్రాంతాల్లో దోమలు పెరగడంతోపాటు ఆ ప్రాంతంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. మలేరియా, డెంగ్యూ, బోధకాలు, టైఫాయిడ్ వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బహిరంగ మల విసర్జన, వల్ల ఈగలు ఆహార పదార్థాలపై వాలడంతో కలరా, వాంతులు, విరేచనాలు, మెదడువాపు, డయేరియా వ్యాధులు వస్తాయి. ఈ కాలంలో జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయవద్దు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం!

అధికారులు వర్షాకాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కానీ పారిశుధ్య, ఆరోగ్య సిబ్బంది ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో గ్రామాల్లో మురుగు పేరుకుపోతోంది. నీటి ట్యాంకుల క్లోరినేషన్, మురికి కాలువల్లోని చెత్త తొలగించడం లాంటివి చేయాలి. కానీ అలా ఎక్కడ కూడా కనిపించడం లేదు. దీంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామస్థాయిలో అధికారులు వారి గ్రామాల్లో శుభ్రతపై శ్రద్ధతీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

టీజీఎన్‌పీడీసీఎల్

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..



విద్యుత్ ప్రగతిభవన్ (ఫైల్)

● అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ చాట్‌బాట్ ● ఫిర్యాదులు మొదలుకొని దరఖాస్తుల వరకు..
● ఆధునిక సాంకేతికతను జోడించిన టీజీఎన్‌పీడీసీఎల్ ● సమస్యలకు పరిష్కార వేదికగా పోర్టల్

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారులకు చేరువయ్యేందుకు సేవలను విస్తరించింది. వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సాంకేతికతను జోడించింది. మీటర్ దరఖాస్తు మొదలుకొని విద్యుత్ స్తంభాల వరకు ఫిర్యాదులను సైతం ఆన్‌లైన్‌లోనే చేసేలా పోర్టల్‌ను ప్రారంభించింది. గత కొన్ని రోజులుగా సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే చేస్తోంది. వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు వాట్సాప్ చాట్‌బాట్‌ను ప్రారంభించింది. ఫిర్యాదుదారులు తమ ఫిర్యాదును ఎక్కడ ఉందో తెలుసుకునేలా ట్రాకింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటితోపాటు వ్యవసాయ కనెక్షన్‌లు, గృహోపకరణ కనెక్షన్‌లు, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, టెండర్లు, ఉద్యోగుల ఫోన్‌నెంబర్లు, కేటగిరీ మార్పులు, బిల్లు హిస్టరీ తదితర సేవలన్నింటిని ఆన్‌లైన్‌లోనే సులవుగా చేసుకునేలా సాంకేతికతను అందుబాటులోకి ఉంచింది. దీంతో విద్యుత్ వినియోగదారులకు సేవలు సులభతరం అయ్యాయి.

అందుబాటులోకి తెచ్చిన వాట్సప్ చాట్‌బాట్

టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్ చాట్‌బాట్ సేవలను అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా విద్యుత్ వినియోగదారులు మొదట 7901628348 నెంబర్‌ను సేవ్ చేసుకొని ఆ నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపించాలి. వెంటనే ఆ వాట్సాప్ చాట్‌బాట్ నుంచి రిప్లయి



వస్తుంది. రిప్లయి రావడంతోపాటు రిజిష్టర్ కాంప్లయింట్, ట్రాక్ కాంప్లయింట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. అందులో రిజిష్టర్ కాంప్లయింట్ అనే ఆప్షన్ క్లిక్‌చేయ గానే ఫిర్యాదుకు అనుగుణమైన సమాచారం అందుతుంది. ఫిర్యాదు అనంతరం కాంప్లయింట్ ఐడి జనరేట్ అవుతుంది. ఆ తర్వాత సేవల్లో జాప్యం జరిగితే కాంప్లయింట్ ఐడితో వినియోగదారుల ఫిర్యాదును ట్రాక్‌చేసి ఎక్కడ పెండింగ్ ఉందో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

కొత్త సర్వీసుల కోసం

గృహ అవసరాల కోసం, కమర్షియల్ అవసరాల కోసం కొత్తగా విద్యుత్ కనెక్షన్‌లను తీసుకోవాలంటే ముందుగా సరైన ధ్రువపత్రాలతో మీసేవాలో దరఖా స్తును సమర్పించాలి. సమర్పించిన పత్రాలు టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్ ద్వారా ఆయా సబ్ డివిజన్‌లకు వెళ్తాయి. అనంతరం సబ్‌డివిజన్‌కు సంబంధించిన అధికారులు సంబంధిత గృహాలను సందర్శించి ఎంక్వైయిరీ చేసి వాటికి కావాల్సిన ఎస్టిమేషన్ వేసి నూతన సర్వీసులను ఇవ్వనున్నారు. ఇదంతా గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగానే అధికారులే ఇంటికి వచ్చి నూతన మీటర్ కనెక్షన్ ఇవ్వనున్నారు.

వ్యవసాయ కనెక్షన్లు సైతం ఆన్‌లైన్‌లోనే

వ్యవసాయ కనెక్షన్లను గతంలో తీసుకోవాలంటే దళారుల చేతివాటం ఎక్కువగా ఉండేది. దళారుల చేతివాటాన్ని తగ్గించేందుకు పారదర్శకత కోసం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. రైతు మీసేవ కేంద్రంలో నూతన కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. వెంటనే దరఖాస్తు దారునికి సమాచారం అందుతుంది. అనంతరం టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓపెన్ చేసి అందులో ఎల్‌టీ న్యూ సర్వీస్ కనెక్షన్ విభాగంలో అగ్రికల్చర్‌ను ఎంచుకోవాలి. మీసేవ ద్వారా మొబైల్‌కు వచ్చిన నెంబర్‌ను యాప్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం సబ్ డివిజన్‌కు వెళ్తుంది. సంబంధిత అధికారులు ఎస్టిమేషన్ వేస్తారు. నూతన కనెక్షన్ మంజూరైతే సమాచారం మొబైల్‌లోని యాప్‌లో కనిపిస్తుంది.

పేరుమార్పు, కేటగిరి మార్పు సైతం..

గతంలోఉన్న మీటర్ పేరు మార్పు సైతం ఆన్‌లైన్ ద్వారానే మార్చనున్నారు. ఇందుకోసం నేరుగా టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో కానీ లేదా మీసేవాలో కానీ సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తు సంబంధిత అధికారులకు వెళ్తుంది. వెళ్లిన అనంతరం సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి సరైన పత్రాలు సమర్పిస్తే పేరుమార్పు చేయనున్నారు. కేటగిరి మార్పు కోసం తగిన ఆధారాలతో మీసేవలో దరఖాస్తు చేయగానే అధికారులు పరిశీలించి కేటరిగి మార్చనున్నారు.

వినియోగదారుల ఫిర్యాదులు ఆన్‌లైన్‌లోనే..

విద్యుత్ వినియోగదారులు సమస్యలను చెప్పుకోవడానికి గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ప్రస్తుతం టీజీఎన్‌పీడీసీఎల్ సమస్యల పరిష్కారం కోసం టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. మొదటగా టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే కంజుమర్ కంప్లయింట్ అని కనబడుతుంది. ఎంటర్ కొట్టగానే సర్వీస్ నెంబర్, మొబైల్ నెంబర్‌తోపాటు సమస్యలను తెలియజే యాలి. కంప్లయింట్ సర్కిల్‌లోని సబ్‌డివిజన్‌లకు వెళ్లిపోతుంది. ఏడీఈ కంప్లయింట్‌ను రిసీవ్ చేసుకుంటారు. సమస్యను పరి ష్కారం చేస్తే వినియోగదారునికి మొబైల్‌లో మెసెజ్ రూపంలో వెళ్తుంది. సమస్యను ఎప్పటికప్పుడు స్టేటస్ రూపంలో సంబంధిత మొబైల్‌కు మెసేజ్ రూపంలో వెళ్తుంది. దీంతోనే మొబైల్ నెంబర్ మార్పు, ఆధార్ అప్‌డేట్ తదితర సేవలను వినియోగించుకోవచ్చు.

ఈ-స్టోర్ విధానం

గతంలో అధికారులు పనిచేయాలంటే దానికి కావాల్సిన సామగ్రిని నేరుగా స్టోర్‌కు వెళ్లి కార్యాలయంలో పేపర్ రూపంలో దరఖాస్తు చేసి స్టోర్‌లో సామగ్రి ఉంటే తెచ్చుకునేవారు. దీంతో సమయం చాలా వృథా అయ్యేది. ప్రస్తుతం ఈ-స్టోర్ ద్వారా కార్యాల యానికి రావాల్సిన అవసరం లేకుండా ఈ స్టోర్ ద్వారా అవసరమైన సామగ్రి ఆన్‌లైన్ ద్వారా పొందొచ్చు.

పారదర్శకంగా ఉండేందుకే అన్నిసేవలు ఆన్‌లైన్‌లోనే

● రాపెల్లి రవీందర్, ఎస్ఈ, నిజామాబాద్



టీజీఎన్‌పీడీసీఎల్ అన్ని సాంకేతిక హంగులను జోడించి ఆధునాతన యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తెచ్చింది. ఇందులో వినియోగదారులు దరఖాస్తు నుంచి మొదలుకొని ఫిర్యాదుల వరకు సులువుగా పరిష్కారం అయ్యే విధంగా రూపొందించారు. ప్రస్తుతం కార్యాలయాల చుట్టు తిరగకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని సమస్యను పరిష్కరించుకోవచ్చు. కొత్తగా వచ్చిన వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా సమస్యను చెప్పొచ్చు. పరిష్కారం అయ్యేవరకు వాట్సాప్‌లో ట్రాక్ చేయవచ్చు.

మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే..

ఈ సేవలతోపాటు మరిన్ని సేవలను టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌లో అందించనున్నారు. బిల్ హిస్టరీ కోసం పోర్టల్‌లోకి వెళ్లి కన్జూమర్ ఐడీ ఎంటర్ చేస్తే బిల్ హిస్టరీ మొత్తం కనబడుతుంది. అనంతరం పేమెంట్ కూడా ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు. యాక్సిడెంటల్ రిపోర్టు కూడా ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. ఉద్యోగులు విద్యుత్ ప్రమాదాల బారినపడ్డ విద్యుత్ వినియోగదారులు ప్రమాదం జరిగిన తర్వాత రిపోర్టుల కోసం యాప్‌లో స్థితిగతులను తెలుసుకోవచ్చు. టెండర్లు సైతం ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. వీటితోపాటు టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అధికారుల ఫోన్ నెంబర్లు సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.



పాఠశాలలో పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

సాంపల్లి పాఠశాలలో
చిన్నారులకు అక్షరాభ్యాసం

డిచ్‌పల్లి, జూన్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గ్రామస్థులంతా కలిసి సర్కారు బడులను బలోపేతం చేయాలని కోరారు.

గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ

వేల్పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పడిగెల గ్రామంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామంలో రామాలయ ంలో ప్రత్యేకపూజలు చేసి మహిళలు నైవేద్యాలతో కూడిన బోనాలను డప్పువాయిద్యాలు, వలగొడుగు మధ్య గ్రామం లోని ప్రధాన వీధుల మధ్య ఊరేగింపుతో వెళ్లి పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పెసరి సుమన్, బద్దం రాజారాం, గుర్రం స్వామి, గుర్రం నరేష్, గుర్రం రాజేశ్వర్, సంఘ సభ్యులు, మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

నాళేశ్వర్‌లో బోనాల పండుగ

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో శుక్రవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సుమారు 400 మున్నూరు కాపు కుటుంబ సభ్యులతోపాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. స్థానిక పోచమ్మ తల్లి, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలకు భక్తులకు తరలివెళ్లారు. పురుషులు తలపై బోనాలను ఎత్తుకోగా మహిళలు మంగళహారతులతో ముందుకు నడిచారు. స్థానిక మున్నూరు కాపు కల్యాణ మండపం నుంచి పురవీధుల్లో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పాడిపంటలు చల్లగా ఉండాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, యువతి, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



పడిగెల గ్రామంలో బోనాలతో మహిళలు



నాళేశ్వర్‌లో బోనాలతో మహిళలు



శిథిలావస్థకు చేరిన లక్కోర ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం గదులు



శిథిలావస్థకు చేరిన జాన్కంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం గదులు

సమస్యల వలయంలో సరస్వతీ నిలయాలు!

● అరకొర వసతుల మధ్య విద్యాబోధన ● శిథిలావస్థలో తరగతి గదులు
● వర్షానికి ఉరుస్తున్న తరగతి గదులు ● విద్యా బోధనకు ఇబ్బందులు

వేల్పూర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని లక్కోర, జాన్కంపేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత కొన్నేళ్లనుంచి ఎదుర్కొంటున్న సమస్యలను ఈ విద్యా సంవత్సరం కూడా విద్యార్థులు ఎదుర్కోనున్నారు. ఆయా పాఠశాలల భవనాలు సుమారు 60ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో గత్యంతరం లేక శిథిలావస్థలో ఉన్న గదులలోనే విద్యార్థులకు చదువుకోవాల్సిన దుస్థితి ఉంది. తరగతి గదుల పైకప్పు నుంచి అప్పుడప్పుడు పెచ్చులూడుతూ విద్యార్థులకు భయాందోళన కలిగిస్తున్నాయి. లక్కోర పాఠశాలలో పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. చాలావరకు తరగతి గదుల గోడలు బీటలువారాయి. కొన్ని తరగతి గదుల కిటికీలు, తలుపులు పగిలిపోవడం వల్ల వర్షం కురుస్తున్నప్పుడు వర్షం నీరు గదుల్లోకి వస్తుండడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. స్లాబ్‌పైన వర్షంనీరు నిలిచి ఉండడం వల్ల తరగతి గదులు గోడల నుంచి నీల్లు కారుతూ గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా బోధనకు మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిన వాటిని సక్రమంగా వినియోగించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా పాఠశాలల భవనాలలోని దాదాపు అన్ని గదులు శిథిలావస్థకు చేరుకున్నప్పటికి ప్రజాప్రతినిధులు, అధికారులు భవనాల మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల వెనుక, ముందు ఆవరణలో వర్షపు నీరు నిలిచి బుర దగా మారుతూ దుర్వాసనతో పాటు దోమల బెడదను విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్నారు. వర్షం పడుతు న్న సమయంలో తమ పిల్లలను శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు పంపడానికి తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. లక్కోర ఉన్నత పాఠశాల లో నూతనంగా చేపట్టిన ఆరు అదనపు గదుల నిర్మాణ పనులు స్లాబ్ పనుల వరకే ఆగిపోయింది. నిధుల కొరత వల్ల భవనం పనులు ఆగిపోయినట్లు, ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు రావడం లేదన్న ఉద్దేశ్యంతో భవనం పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ము ందుకు రావడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలకు మరమ్మ తులు చేయడం లేదా వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించి విద్యార్థుల విద్యబోధనకు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



లక్కోర పాఠశాల భవనం పైకప్పు రేకులు కూలిపోయిన దృశ్యం



జాన్కంపేట్ పాఠశాల గదిలో స్లాబ్ పై నుంచి పెచ్చులూడిన దృశ్యం



ఘన్‌పూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి

రెవెన్యూ సదస్సులకు భారీగా దరఖాస్తులు

● వారం రోజుల్లో 2500 దరఖాస్తులు

డిచ్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అధికారులు గత 10 రోజుల పాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 2,500 దరఖాస్తులు వచ్చిన్నట్లు తహసీల్దార్ సతీశ్‌రెడ్డి తెలిపారు. ఈ దరఖాస్తులను గ్రామాల వారిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోనే డిచ్‌పల్లిలో ఎక్కువదరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా ఎండు గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసి 184 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న తెలిపారు. శుక్రవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు నిజామాబాద్ నగరంలోని శుకార్ ఫామౌజ్‌లో తనిఖీలు నిర్వహించగా షేక్ షకీల్, దాతురాంలు ఎండు గంజాయి అమ్ముతూ పట్టుబడ్డారు. షేక్ షకీల్ వద్ద 134 గ్రాములు, దాతురాం వద్ద 50 గ్రాములు మొత్తం 184 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు మధుకర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తదుపరి చర్యలకు అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ స్వప్న మాట్లాడుతూ గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తులను విచారణ కోసం తీసుకువచ్చి గంజాయి అమ్మకానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని సేకరించామని రాబోయే రోజుల్లో మరికొంత మందిని పట్టుకుంటామని తెలిపారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాను గంజాయి రహితంగా చేయనున్నామని తెలిపారు. ఎవరూ గంజాయి, మత్తు పదార్థాలు అమ్మిన 87126 58970 నెంబర్‌ను సమాచారం ఇవ్వాలని వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాంకుమార్, అమీద్, శివ, ఉత్తమ్, అవినాశ్, భోజన్న, విష్ణు, రాజన్న పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి ఒకరి మృతి

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన సిద్దులోల్ల మల్లేష్ (76) అనే వ్యక్తి గురువారం అర్ధరాత్రి పద్మశాలి సంఘం వద్దగల డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కూరగాయల వ్యాపారం నిర్వహిస్తూ సా యంత్రం మద్యం తాగే అలవాటున్న మల్లేష్ గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మద్యం మత్తులో డ్రైనేజీలో పడి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మల్లేష్ కొడుకు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

డిచ్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లికి చెందిన సిర్నాపల్లి గంగా నర్సయ్య (50) గత 4 రోజుల క్రితం గల్ఫ్ దేశం కువైట్‌లో గుండె పోటుతో మరణించాడు. కంపెనీ యాజమాన్యం, ప్రవాస భారతీయుల సహకారంతో మృతదేహం స్వగ్రామానికి శుక్రవారం చేరింది. కడసారి చూపు కోసం గ్రామస్థులు, బంధువులు, తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతునికి భార్య సుజాత, కొడుకు భరత్, కూతుళ్లు దీపిక, నైనితలు ఉన్నారు. మృతదేహం చూసి కుటుంబ సభ్యులు భోరున రోదించారు.


గల్ఫ్ నుంచి మిట్టపల్లికి చేరిన మృతదేహం

ఆర్యవైశ్య పట్టణ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసిన ధన్‌పాల్ శ్రీనివాస్

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్ష పదవికి ధన్‌పాల్ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య పట్టణ సంఘంలో నామినేషన్ పత్రాలను 6 అనుబంధ సంఘాలతో దాఖలు చేశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ శ్రీని వాస్ మాట్లాడుతూ ఆర్యవైశ్య పట్టణ సంఘం అభివృద్ధికి నిస్వార్థంగా సే వలు అందించే నాయకులను ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో తమ ప్యానల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్ని కలను ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారి విజయ్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్దా లక్ష్మీకాంతం, లక్ష్మణ్, లాబిశెట్టి శ్రీనివాస్, మార లింగేష్, ఇల్లెందుల ప్రభాకర్, వీరమల్లి రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల వృత్తిని ఇతరులు చేయకుండా చూడాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల వృత్తిపై ముప్పేట దాడి జరుగుతుందని ఇతర కులస్తులు నాయీబ్రాహ్మణుల వృత్తిని చేపట్టి మా పొట్టకొడుతున్నారని నగర నాయీబ్రాహ్మణ దుకాణాల అసోసియేషన్ అధ్యక్షుడు దేశాయి గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల కులవృత్తిని నాశనం చేసే విధంగా ఇతర కులస్థులకు మంగళి షాపులు పెట్టుకునే విధంగా ప్రోత్సహించిందన్నారు. నాయి బ్రాహ్మణుల కులవృత్తిపై పొట్టకొట్టి యూపీ నుంచి వచ్చి మంగళి షాపులు పెట్టుకొని మా పొట్ట కొడుతున్నారన్నారు. చట్ట విరుద్ధంగా నడిపిస్తూ కులవృత్తిని అవ మానించే విధంగా చేస్తున్నారని అన్నారు. ఇతర కులస్థులను మంగళిపని చేయకుండా ఆపాలని ప్రభుత్వం అలాంటి వారికి దుకాణాలు పెట్టకుండా ఆపాలని అన్నారు. అంతేకాకుండా నాయీబ్రాహ్మణులకు క్షౌరశాలలను ఆధునీకరించడానికి సబ్సిడీపై రుణాలను అందించాలని, ఇతర మతస్తులు నాయీబ్రాహ్మణ దుకాణాలు పెట్టకుండా మున్సిపల్ అధికారులు అనుమతివ్వకూడదని, 50 ఏళ్లు పైబడిన నాయీబ్రాహ్మణులకు ఆసరా పెన్షన్ అందించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్, నాగేష్, అంజయ్య, హన్మాండ్లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి సీఐగా వినోద్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

డిచ్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కడారి వినోద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం ట్రాన్స్‌కో నుంచి బదిలీపై వచ్చిన వినోద్‌రెడ్డి సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మల్లేశ్ ఐజీ కార్యాలయానికి ఉన్నతాధికారులు అటాచ్ చేశారు. సర్కిల్‌లో శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


డిచ్‌పల్లి సీఐ వినోద్‌రెడ్డి

నల్లవెల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

ఇందల్వాయి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ఎగిరిన పది నిమిషాల్లోనే సమీపంలోని మెడికల్ కాలేజీపైన కుప్పకూలడంతో విమానంలో ప్రయాణిస్తున్న 240మందితో పాటు 50 మెడికల్ కాలేజీ విద్యార్థులు మృతి చెందడంతో ఆ విషాద ఘటనను నిరసిస్తూ మండలంలోని నల్లవెల్లి గ్రామంలో 2009-10 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

జిల్లాలో 5.36 సెంటీమీటర్ల వర్షం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 5.36 సెంటీమీటర్ల వర్షం పడింది. అత్యధికంగా జక్రాన్‌పల్లిలో 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మోపాల్‌లో 31.2, మోస్రాలో 28.9, చందూర్‌లో 28.5, ధర్పల్లిలో 27.7, నిజామాబాద్ నార్త్‌లో 23.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సరాసరి 16.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

నిజామాబాద్ కల్చరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి వారం రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు భారత్ స్వాభిమాన్ కార్యదర్శి విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతాంజలి యోగా ఆధ్వర్యంలో నగరంలోని ఎంజీ ఫంక్షన్‌హాల్‌లో తరగతులు నిర్వహించనున్నామన్నారు. ఏడు రోజుల పాటు నిర్వహించే తరగతులు ప్రతీరోజు ఉదయం 5.30ల నుంచి 7.30 వరకు ఉంటాయన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

ఇందల్వాయి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలే రియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ గ్రామంలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని నీటి నిల్వలు గల ప్రాంతాలను తొలగించి దోమలు నిలువ లేకుండా చెత్తా చెదారం తొలగించేలా, నీరు లీకేజీ ఉన్న నల్లా లను మూసివేయాలన్నారు. మురికి గుంటలు లేకుండా చూడాలని, మంచినీటి వాటర్ ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్‌ను కలపాలని ఆదేశించారు. ఆడ దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫ్యూలెక్స్ దోమల వల్ల ఫైలేరియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ క్రిస్టినా, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ భువన, మండల అభివృద్ధి అధికారి అనంత్ రావు, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అప్రమత్తంగా ఉండాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీరోజు వైద్యులు విధులకు తప్పకుండా హజరుకావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా సెలవులు తీసుకోవద్దన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమత, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.


కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న తుకారాం రాథోడ్

స్వధార్ హోమ్ ఆకస్మిక తనిఖీ

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయంతో రీడో అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న స్వధార్ హోమ్‌ను శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు పోలీస్ కమీషనర్ బస్వారెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వధార్ హోమ్‌లో సరైన రక్షణ ఏర్పాట్లు లేవని నిధుల దుర్వినియోగం అవుతుందని జిల్లా కలెక్టర్‌కు గత ఏడాది ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో జనవరి 2025లో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, పోలీస్ కమీషనర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, డీఎంఎఫ్‌వో, డిస్ట్రిక్ వెల్ఫేర్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్, స్నేహసొసైటీ కార్యదర్శి సిద్దయ్యలు సభ్యులుగా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. స్వధార్ హోమ్‌పై గతంలో అనేక ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ప్రస్తుతం స్వధార్ హోమ్‌కు అధికారిక అనుమతి లేకపోగా రెండేళ్లుగా అనుమతి లేకుండానే హోమ్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎంతమంది బాధిత మహిళలకు ప్రవేశం కల్పించారో, ఎన్ని నిధులు ఖర్చు చేశారో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక నిధుల ఖర్చు, జమ లెక్కలు సక్రమంగా లేవని గుర్తించారు. హోమ్ నిర్వాహణకు సంబంధించి లైసెన్స్ తీసు కోకపోవడం తనిఖీలలో బయటపడింది.


స్వధార్ హోమ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి, అదనపు కలెక్టర్, తదితరులు

కిట్స్‌లో ఉత్సాహంగా ఫేర్‌వెల్ పార్టీ


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీ ఉత్సాహంగా సాగింది. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ డ్యాన్స్‌లతో అలరించారు. ప్రత్యేక నృత్యాలతో ఆకట్టుకున్నారు. తీన్‌మార్ స్టెప్పులు, జానపద పాటలకు విద్యార్థినులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజినీకాంత్ హాజరై మాట్లాడుతూ కష్టపడి చదివి వివిధ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సెల్వరాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ సాయరెడ్డి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ బారికేడ్‌లను అందజేసిన వెల్నెస్ ఆస్పత్రి



ట్రాఫిక్ బారికేడ్‌లను అందజేస్తున్న వెల్నెస్ ఆస్పత్రి యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ప్రారంభం కానున్న వెల్నెస్ ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, సిబ్బందికి 100 బారికేడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ ఈ బారికేడ్‌లను నగరంలో ట్రాఫిక్ నియంత్రించడంలో రోడ్డుపై ఇతర అవసరాల కొరకు ఉపయోగిస్తామన్నారు. వాహనదారులు రోడ్డుపైన వాహనాలు పార్కింగ్ చేయవద్దని, పార్కింగ్ సెల్లార్, పేయిడ్ పార్కింగ్ ఖాళీ స్థలాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా బారికేడ్‌లను అందజేసిన ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఆస్పత్రి ప్రతినిధులు అశోక్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సెల్లార్ పార్కింగ్ ఉందని, వ్యాలెట్ పార్కింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో తమ భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆర్ఐ వినోద్, శేఖర్, పాల్గొన్నారు.

లీజ్ గడువు ముగిసినా అనుమతి లేకుండా అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖిల్లారోడ్‌లో గల గోల్డెన్ జూబ్లీ ఇంటర్మీడియెట్ కళాశాలకు అనుమతులు లేకుండానే యాజమాన్యం అడ్మిషన్లు చేస్తుందని ఆల్ ముర్తజా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి నాదిర్ షా రజానీ ఆరోపించారు. శుక్రవారం కళాశాల ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడారు. గోల్డెన్ జూబ్లీ కళాశాలకు ఆల్‌ముర్తజా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్‌కు సంబంధించిన భవనాన్ని కొన్నేళ్లుగా లీజ్‌కు ఇచ్చానని అయితే సంబంధిత లీజ్ గడువు ముగిసిందని తెలిపారు. లీజ్ గడువు ముగిసిన ఎటువంటి ఒప్పంద ప్రక్రియ లేకుండానే ఇంటర్మీడియెట్ కళాశాలలో అడ్మిషన్లు చేస్తున్నారని అన్నారు. లీజ్ గడువు ముగిసిన నేపథ్యంలో భవనాన్ని ఖాళీ చేయాలని ఇదివరకే నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు కమీషనర్‌కు సైతం ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. కానీ ఇప్పటికే అడ్మిషన్లు చేశారని కావున వెంటనే కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముబారక్‌నగర్, దుబ్బ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముబారక్‌నగర్, దుబ్బ ప్రాంతంలో 2వ శనివారంలో భాగంగా మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాల అందజేత

డిచ్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చౌకి వెంకటేశ్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు మెరుగైన విద్యా లభిస్తుందని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి డబ్బులు వృథ చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, గంగాధర్, ఐకేపీ సీసీ సురేశ్, సీఏ సవిత, అంగన్‌వాడీ టీచర్ శారద, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

హరితహారంపై సమీక్ష

డిచ్‌పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో భుక్య లింగం నాయక్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో హరితహారం, ఉపాధి హామీ పనులు, కొత్తగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు.


ఉపాధి హామీ సిబ్బంది తో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

ప్రజలకు మంచి కంటి వైద్యాన్ని అందించాలి

● నవీన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆసుపత్రిని ప్రారంభించిన ఎంపీ అర్వింద్


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు మంచి నాణ్యమైన కంటి వైద్యాన్ని అందించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ కోరారు. శుక్రవారం నగరంలోని ఖలీల్‌వాడిలో డాక్టర్ నవీన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆసుపత్రిని ప్రారంభించారు. నూతన టెక్నాలజీతో అందరికి అందుబాటులో వైద్యం అందించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన వైద్యాన్ని అందించి సేవ చేయాలని ఈ సందర్భంగా ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏలేటి మల్లికార్జున్, మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, ఆ సుపత్రి డైరెక్టర్ డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నాబార్డు చేయూత

(ఐదో పేజీ తరువాయి)

తో పాటు దీనిద్వారా వారికి మెరుగైన ఆదాయం అందేవిధంగా నాబార్డు ప్రోత్సహించనుంది. ఈ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మార్కెటింగ్, ఉత్పత్తి రంగాల్లో తగిన శిక్షణ అందిస్తారు. చేపలకు గిరాకీ ఉండటం వల్ల చేపలను ఉత్పత్తి చేయడం, మార్కెటింగ్ చేయడం వాటికి సంబంధించిన ఔట్‌లెట్‌లను ఏర్పాటు చేసేందుకు ఈ ప్రోత్సాహాన్ని అందిస్తారు. డెయిరీ ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా ఇదేవిధమైన మెలకువలను అందిస్తారు. గేదెలు కొనడంతో పాటు పాల ఉత్పత్తి పెంచడం మార్కెటింగ్ చేయడం, వాటికి సంబంధించిన స్టోర్స్‌ను ఏర్పాటు చేసేందుకు తగిన అవకాశాన్ని కల్పిస్తారు. వ్యవసాయంతో పాటు ఈ అనుబంధ రంగాల నుంచి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తోడ్పాటును అందించేందుకు ఈ ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ నిధులను అందజేస్తున్నారు. జిల్లాలో మొదటి సారిగా ఇందల్వాయి మండలంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తి దారుల సంఘానికి ఈ నిధులను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవే కాకుండా మేకలు, పందుల పెంపకానికి కూడా తోడ్పాటును వచ్చే సంవత్సరాల్లో అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నాబార్డు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఎక్కువగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో మత్స్య, డైరీ రంగా లకు సంబంధించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసేందు కు చర్యలు చేపట్టినట్లు నాబార్డు డీడీఎం ప్రవీణ్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొదటి సారిగా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పసుపు మొక్కజొన్న, సోయాకు సంబంధించిన ఆరు ఉత్పత్తిదారుల సంఘాలను గతంలో నాబార్డు సహాయంతో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

'ఫీ'జులుం!

(ఐదో పేజీ తరువాయి)

నర్సరీ నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల్లో ఏవైనా పాఠ్య పుస్తకాలు వాడవచ్చనే నిబంధనలకు ప్రైవేటు పాఠశాలలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. తమకు నచ్చిన కంపెనీ నుంచి తక్కువ ధరకు పుస్తకాలను తీసుకువచ్చి విద్యార్థులకు మాత్రం ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తమ వద్దే పుస్తకాలు కొనాలని బయట ఎక్కడా దొరకవని చెబుతూ దోపిడికి పాల్పడుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ డ్రెస్సులు, షూస్, బ్యాగులు ఇలా చిన్న చిన్న తరగతుల విద్యార్థులకే వేలాది రూపాయల బిల్లులు వేస్తూ దోపిడికి పాల్పడుతున్నాయి. స్వయం ఉపాధి కోసం కొంత మంది ప్రైవేటు పాఠశాలలను ఏర్పాటు చేసుకొని జీవనం గడుపుతున్నప్పటికీ కొన్ని కార్పొరేట్ పాఠశాలలు మాత్రం విద్యను వ్యాపారంగా మార్చి యథేచ్ఛగా దోపిడికి పాల్పడుతున్నారు. ఇలాంటి పాఠశాలల విషయంలో విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేసినప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

పాఠశాలకు అనుమతి లేదు..

నగరంలోని బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న శ్రీచైతన్య పాఠశాల కొత్త బ్రాంచ్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు రూరల్ మండల విద్యాశాఖ అధికారి సేవ్లా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మీ పిల్లలను ఆ పాఠశాలలో అడ్మిషన్ చేయవద్దని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై రామకృష్ణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సై రామకృష్ణ, గ్రామస్థులు

ధర్పల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలపై మండల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ధర్పల్లి ఎస్సై రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, పరిణామాల దుష్ప్రభావాలు ప్రజలకు వివరించారు. యువకులు డ్రగ్స్‌పై ఆకర్షితులు కాకుండా ఉండాలని తల్లి దండ్రులు తమ బాధ్యతలను గుర్తెరగాలన్నారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT NIZAMABAD
ARB No. 318 / 2024

Between:-
M/s Shubha Darshhini Chits Pvt Ltd Bodhan Br ...Disputet

Vs

Sandeep Pasumarthi & Others ...Opponents

To,
OPP 1) Sandeep Pasumarthi S/o.James, age 29 years, R/o. H.No.36-108, Pasumarthi Palem, Addanki (South) (U), Prakasham Disrtict, Andhra Pradesh State.
OPP 3) Surarapu Anil Kumar S/o. S. Bhixamaiah, age 29 years, Occ: Asst Executive Engineer (Rural Water Supply & Sanitation Department), Bodhan Sub-Division, Bodhan Mandal, Nizamabad District, Telangana State. R/o. H.No: 1-144, Shabdulla Puram Village, Kangal Mandal, Nalgonda District, Telangana State

The Disputant has filed the dispute for recovery of amount and summon/notice sent on your address are unserved. Whereas the dispute is posted for your appearance on 18/06/2025 at 11.30 A.M You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte

// By order of the Dy. Registrar of Chits//
Sd/- **Deputy Registrar of chits** Nizamabad

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.200	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	రూ.120	రూ.210	రూ. 240





బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.99,400	రూ.91,500	రూ.1080

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (తెలుగు 3డి) (11.00, 1.45, 4.30)
: హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (ఇంగ్లీష్ 3డి) (7.15, 10.00)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హింది) (10.10, 4.25)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (1.40)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (ఇంగ్లీష్) (7.55, 10.40)
స్క్రీన్-3 : ది హంటర్ (తెలుగు) (11.10)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.50)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (4.20)
: హౌజ్‌ఫుల్-5 (హింది) (7.05, 10.35)
స్క్రీన్-4 : ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (11.30) : కట్టప్ప జడ్జిమెంట్ (2.15)
: పాప (4.50) : అందాల రాక్షసి (7.35, 10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తొలిప్రేమ (11.00),1-30,4-30,7-30,10-30
స్క్రీన్-2 : అందాల రాక్షసి (11.00, 4.30)
: హౌజ్‌ఫుల్-5 (హింది) (1.35, 7.30, 10.30)
స్క్రీన్-3 :: అందాల రాక్షసి (10.20)

దేవి : తొలిప్రేమ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్